


# జయం

**చాలామంది** మహాత్ముల జీవితాల్లోని సంఘటనలని జయం నవల్లోని ప్రధాన పాత్ర మునిరత్నం ఉరఫ్ శివబాబాకి జరిగినట్లుగా రాసాను. అందువల్ల వారి ఆశీర్వచనాలు ఈ నవల మీద ఉండబట్టి పాఠకులకి నచ్చిందనే నమ్మకం కూడా నాలో బలంగా ఉంది. నవల్లోని ఈ కింది సంఘటనలు ఆయా మహాత్ముల జీవితాల్లో జరిగిన సంఘటనల్లోంచి తీసుకున్నాను. చాలామంది మహాత్ములు తాము దేహ త్యాగం చేసేముందు తమ ప్రియశిష్యులకి కలలో కనపడి ఆ సంగతి చెప్పారు. అలాగే ఓ మహాత్ముడు జన్మించడానికి ముందు వారి తల్లులకి స్వప్నంలో అలాంటి సూచనలు కనిపించినట్లు రికార్డు అయింది. పరమహంస యోగానంద ఒక యోగి ఆత్మకథలో కూడా ఇది వస్తుంది. వీటిని ఈ నవల్లో వాడాను. కంచి పరమాచార్యులు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి పసికందుగా ఉండగా ఆయన జాతకం చూసిన పండితుడు ఆ పసికందు కాళ్ళకి నమస్కరించి, తను తరించేలా ఆశీర్వదించమనడం చూసి తల్లితండ్రులు ఆశ్చర్యపోతే 'ఇతను శంఖచక్రాలతో పుట్టాడు. గొప్ప మహాత్ముడు అయ్యే జాతకం ఉంది. అందుకని నమస్కరించాను' అని చెప్పాడు. దీన్ని యథాతథంగా జయంలో వాడాను. అలాగే జయంలోని కథ జరిగేది రాయలసీమలోని చాలాచోట్ల.




నేను ఓ సందర్భంలో నాడీజ్యోతిష్యం చూపించుకున్నప్పుడు అహోబిలానికి వెళ్ళి స్వామి దర్శనం చేయమని పరిహారంగా వచ్చింది. అదే సమయంలో నంద్యాల నించి శ్రీ కె. శ్రీనివాసరెడ్డి అనే అభిమాని నాకో ఉత్తరం రాసారు. నేను ఆయనకి అహోబిలం వస్తున్నానని రాసాను. అక్కడికి నంద్యాల మీదుగానే వెళ్ళాలని ఆయన తన ఫోన్ నంబర్ ఇస్తూ జవాబు రాసారు. నంద్యాలలో హోటల్‌లోని నన్ను కలిసి, గది ఖాళీ చేయించి వారింటికి తీసుకెళ్ళారు. అతను కూడా ఆధ్యాత్మికాభిలాషి. జయంలోని లొకేషన్స్ రాయలసీమలోనివి ఎంచుకోడానికి కారణం శ్రీనివాసరెడ్డిగారే. రాయలసీమ నిండా మఠాలు, మఠాలు అని శ్రీనివాసరెడ్డిగారు ఎంతో ఆసక్తితో నన్ను చాలా పుణ్యక్షేత్రాలకి తన బండిలో తిప్పి చూపించారు. భీమునిపాడు, కోయిలకుంట్ల, జోలదరాసి, ఉయ్యాలవాడ, రుద్రకోటేశ్వరం, నందవరం, సంగమేశ్వరం, యాగంటి, అహోబిలం, మహానంది, గుళ్ళదుర్తి... నవల్లోని ఒక్క గుండ్ల బ్రహ్మేశ్వరాలయం మాత్రమే నేను చూడకుండా రాసింది. దాదాపు

వాటినన్నిటినీ శ్రీ శ్రీనివాస్ తన మోటార్ సైకిల్ మీద, కారు మీద తిప్పి చూపించారు.

మునిరత్నం జాతకంలో అనేకమంది మహాత్ముల జాతకాల్లోని విశిష్టమైన అంశాలని తీసుకున్నాను. ఆ జాతకంలో అవన్నీ ఇముడుతాయో లేదో అని నాకు పరిచయమైన సంస్కృత పండితుడు, జాతకాలు చెప్పడం చక్కగా అభ్యసించిన శ్రీ చేంబ్రోలు సుబ్రమణ్యా శాస్త్రి అనే రిటైర్డ్ లాయర్‌ని సంప్రదించి అది రూపొందించాను. నవల్లో అది ఇలా సాగుతుంది.

"12 నవంబర్ 1934లో జన్మించిన ఈ జాతకుడు పుట్టిన దినమే అద్భుతమైనది. లోకకళ్యాణానికి బుద్ధుడికి జ్ఞానోదయమైన పౌర్ణమి దినాన, ఆత్మదర్శన తత్వాన్ని బోధించిన జగద్గురువైన శ్రీకృష్ణుడు పుట్టిన రోహిణీ నక్షత్రంలో పుట్టాడు. రామకృష్ణ పరమహంస తదితర యోగులు ఉదయించిన కుంభ లగ్నంలో పుట్టాడు. మనిషికి మోక్షాన్నిచ్చే శివుడికి ప్రీతికరమైన కార్తీకంలో పుట్టాడు. వ్యయంలో కేతువు, లగ్నాధిపతి శని. ఇవన్నీ శుభసూచకాలు. పదింట గరుడున్నాడు కాబట్టి మంచి గురువు అవచ్చు. కాలేజీ అధ్యాపకుడులాంటి పదవి చేపట్టచ్చు. మానవులకి సాధారణంగా సంతానం వల్ల కానీ, కళత్రం వల్ల కానీ వచ్చే కష్టనష్టాలకి అతీతుడు."

వ్యయంలో కేతువు సన్యాసి అవుతాడన్న సంగతి చివరి వాక్యంలో చెప్పకనే చెప్పాడాయన.

ప్రతీ తరంలో ఒకరు సన్యసించే శాపం భగవాన్ శ్రీ రమణ మహర్షి వంశానికి తాకి ఆయన సన్యసించారు. దీన్ని కూడా జయంలో వాడాను. భగవాన్ శ్రీ రమణమహర్షి అంటే నాకు చాలా భక్తి. అందుకని ఆయనే మునిరత్నానికి అన్నప్రాసన చేసినట్లుగా నవల్లో రాసాను. ఆయన భక్తుడు కావ్యకంఠ గణపతి మునీంద్రకి జాతకాలు చూడటం వచ్చు కాబట్టి ఆయనే మునిరత్నం జాతకం చూసి చెప్తాడు. ఆయన భక్తుడు శ్రీ రామకృష్ణ అయ్యర్‌ని, కంచి పీఠాధిపతి శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతులని కూడా ఈ నవల్లో పాత్రలుగా తీసుకున్నాను. అలాగే తమిళనాడులోని కుంభకోణం దగ్గర పరమానల్లూరు అనే గ్రామంలో సదాశివన్ అనే ఓ నిరుపేద వంట బ్రాహ్మణుడు నరసింహాలయానికి ఏటా జరిపే ఉత్సవాల్లో 1897, 1909, 1921, 1933లలో అన్నదానం చేసాడు. వర్తకులతో 'నువ్వో బస్తా బియ్యం పంపు, నువ్వు పప్పు, నువ్వు నెయ్యి పంపు' అంటూ సరంజామా తెప్పించేవాడు. వాళ్ళ బాకీ ఏడాది తిరిగేలోగా ఏ మిరాసీదారు ద్వారానో తీర్చేసేవాడు. చిత్రం ఏమిటంటే ఆ దుకాణదారులకి అతను అడిగింది ఇచ్చినప్పుడల్లా అంతకి అంతా లాభం వచ్చేది. అందుకే అతను కోరగానే సరుకు ఇచ్చేవారు. అందరూ కడుపు నిండా తిన్నాక, మిగిలిన సంభారాలన్నీ మఠానికో, గుడికో ఇచ్చేసి పై గుడ్డ దులుపుకుని, ఏ మధ్యాహ్నానికో రెండు ముద్దలు మజ్జిగన్నం మాత్రం తిని కుంభకోణంలోని ఓ మఠం అరుగు మీద పై గుడ్డ పరుచుకుని పడుకునేవాడు. ఇది ఎక్కడో చదివాను. ఆ పాత్రని ఓ పాత్రకి పూర్వజన్మ పాత్రగా తీసుకున్నారు.

ఓసారి రామ్‌లాల్ అనే మహాత్ముడు గోతిలో పడ్డ కుక్కపిల్ల అరుపులు విని వెళ్ళి దాన్ని రక్షించాక శిష్యులు ఆయన్ని పొగిడితే ఆయన ఇలా చెప్పారు.

"దాని బాధ నన్ను బాధించింది. దాని బాధానివారణ ద్వారా నేనూ నా బాధ నించి విముక్తుడ్ని అయ్యాను." శివబాబా ఇలా చేసి చెప్పే సంఘటన జయంలో రాసాను.

బీదవాడి భార్య యాదమ్మకి శివబాబా అంటే భక్తి. తను వండింది ఆయనకి పెట్టాలనే కోరిక ఉంది. ఓ రోజు దూరంగా ఆగిన కార్లని చూసి ఆమె భర్త మల్లేష్, 'శివబాబా డబ్బున్నోళ్ళ మనిషి. మనింటికి ఎందుకు వస్తాడే?' అని భార్యతో చెప్పిన కొద్దిసేపటికి గుడిసెకి శివబాబా వచ్చి ఆవిడ వండింది పెట్టమని అడుగుతాడు. తను ఇంకా వంట మొదలుపెట్టలేదని, కొడుకు కోసం దాచిన పాలు ఇస్తే నిరాకరించి పండిన టమోటాని ఇవ్వమని అది తిని వెళ్ళిపోతాడు. ఇలాంటిది సున్నిపెంటలోని మహాత్ముడైన పూర్ణానందస్వామి జీవిత చరిత్రలో చదివాను.

మునిరత్నం బాబాయి రామావతారం భార్య తలంటుతుండగా తనకి సన్న్యసించాలని ఉందని చెప్పి తెలివిగా భార్య అంగీకారాన్ని తీసుకుని నూనెజిడ్డు శరీరంతో సరాసరి చంద్రశేఖరేంద్ర స్వామి దగ్గరకి వెళ్ళి సన్న్యాసం తీసుకుంటాడు. శ్రీ రామకృష్ణ పరమహంస తమ బంధువుల్లో ఒకరికి జరిగిందని చెప్పిన సంఘటననే ఇలా రాసాను.

చిన్నతనంలో మునిరత్నం స్కూల్లో ప్రిన్స్ ఆర్థర్ పాత్రలో నటిస్తాడు. పెద్ద వయసు పిల్లల్ని కాదని బ్రిటిష్ ప్రిన్స్‌పాల్ మునిరత్నానికే ఆ పాత్రని ఇస్తాడు. ఇది స్కూల్లో చదివే రోజుల్లో చంద్రశేఖరేంద్ర సరస్వతి జీవితంలో జరిగిన సంఘటనే. మరో నిజపాత్ర ఉప్పులూరి గణపతి శాస్త్రి. మునిరత్నం గోదావరి జిల్లా శివల గ్రామంలోని ఉప్పులూరి గణపతిశాస్త్రి దగ్గర సంస్కృత వ్యాకరణ చదువుకుంటాడు. శ్రీ చేంబ్రోలు సుబ్రమణ్యశాస్త్రి తన గురువుగారైన ఉప్పులూరి గణపతి శాస్త్రి గురించి చెప్పారు. జయంలో ఓ నాటకీయ మలుపు తిప్పే చోట నేను వాడిన దేవ్యపరాధ స్తోత్రాన్ని కూడా సుబ్రమణ్యశాస్త్రిగారే నాకు పరిచయం చేసారు.

అలాగే సన్న్యసించడానికి తల్లి అనుమతి అవసరం. దాన్ని తీసుకోడానికి ఆదిశంకరాచార్య జీవితంలో వచ్చిన మొసలి సంఘటన ఆధారంగా పాము సంఘటనని సృష్టించాను. ఓసారి మళయాళస్వామి శిష్యుడు శ్రీ విద్యానందగిరి తన స్వగ్రామం బందరు వెళ్ళడానికి మునుపు ఆయన దగ్గర శెలవ తీసుకోడానికి వచ్చారు. నీ సంచీ ఏది?' అని గురువు అడిగితే తన మిత్రుడు పట్టుకున్నాడని శిష్యుడు జవాబు చెప్పాడు. ఈ జన్మలో వాడు నీ సంచీ మోస్తే వచ్చే జన్మలో వాడి బస్తాలని మొయ్యాలి' అని మళయాళ స్వామి చెప్పిన మాటలు నా గుండెల్లో నాటుకుని అప్పటినించి ఎవరి సహాయం తీసుకోకపోవడం నేర్చుకున్నాను. దాన్ని కూడా జయంలో వాడాను.

సన్న్యసించాక మునిరత్నం బాబాయ్ దేహాన్ని వారి ఇంట్లోనే సమాధి చేసారు. సన్న్యసించాక మునిరత్నం ఆ సమాధి మందిరంలో కొద్దికాలం జీవిస్తాడు. ఇది కూడా ప్రభావితం చెంది రాసిందే వార్త సండే సప్లిమెంట్‌లో ఎడిటోరియల్లో పనిచేసే శ్రీ దోర్భల శర్మ స్వగ్రాం కామారెడ్డి సమీపంలోని రామాయం పేటలో వారి బంధువు రత్నయ్య సన్న్యసించి దేహం చాలించాక ఇంట్లోనే సమాధి చేసారు. ఆయన కొడుకు శ్రీ విశ్వనాథ శర్మని కలవడానికి వెళ్ళినప్పుడు నేనా ఇంటిని దర్శించాను.

ఆ రోజుల్లో పరిచయమైన ఆధ్యాత్మికాభిలాషి శ్రీమతి శైలజ తండ్రి లంకా వెంకట మృత్యుంజయ శాస్త్రి అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ జనరల్‌గా 1982లో రిటైరయ్యారు. 1983 సెప్టెంబర్ 13న వారికి శ్రీ పూర్ణానందస్వామి (శ్రీ శైలం)తో పరిచయం కలిగింది. ఆయన రిటైరయ్యాక సన్న్యసించి ధ్యానం చేస్తున్నప్పుడు రాసుకున్న డైరీని ఆమె నాకు ఇచ్చారు. రామావతారం ధ్యానంలో వచ్చిన అనుభవాలని రాసుకున్న డైరీలోని అంశాలన్నీ యథాతథంగా ఆడైరీలోంచి తీసుకుని రాసినవే.

మునిరత్నం ధ్యానం చేసుకుంటూ తన ఇత్తడి చెంబుని ఎవరైనా ఎత్తుకుపోతారా అని మధ్యమధ్యలో దాన్ని చూస్తూంటాడు. కొద్దిసేపటికి అనిపిస్తుంది, తన మనసు భగవంతుడి మీద కాక ఆ ఇత్తడి చెంబు మీద ఉందని. దాన్ని విసర్జించాక ధ్యానం దేవుడి మీద కుదురుతుంది. ఇది ఏర్పేడులో తర్వాత వ్యాసాశ్రమాన్ని స్థాపించిన మళయాళ స్వామి జీవిత చరిత్రలో వస్తుంది. పన్నెండు సంవత్సరాలు ఆయన తిరుమల్లోని గోగర్భంలో ఒంటరిగా ధ్యానం చేసారు. మునిరత్నం కూడా ఇలా ఒంటరిగా ధ్యానం చేసుకుంటాడు.

శ్రీశైలం సమీపంలోని సున్నిపెంటలో శ్రీ పూర్ణానందస్వామి ఆశ్రమం ఉండేది. ఆయన జీవిత కథలో వస్తుంది. ఓ రోజు శిష్యుడితో ఎక్కువమందికి అన్నం వండమని చెప్తారు. శిష్యుడు అన్నం వండగానే టూరిస్ట్ బస్‌లో ఆయన్ని చూడటానికి కొందరు భక్తులు వస్తారు. వారంతా ఆకలిమీద ఉంటారు. శిష్యుడు వండింది సరిగ్గా అందరికీ సరిపోతుంది. మరో సందర్భంలో అన్నం వండాక భక్తులు వస్తే స్వామి ఓ అన్నం పాత్రమీద బట్ట కప్పి, అందులో తన చేతిని కొద్దిసేపు ఉంచి తీసాక ఎంత మందికి వడ్డించినా ఆశ్చర్యంగా ఇంకా అన్నం అందులో మిగిలి ఉంటుంది. ఈ రెండు అద్భుతాలని కూడా జయంలో శివబాబా చేసినట్లుగా రాసాను.

షిరిడి వెళ్ళిన వాళ్ళు సాధారణంగా సమీపంలోని సాకోరికి కూడా వెళ్ళి ఉపాసినీ మహరాజ్ ఆశ్రమం చూస్తారు. ఆయన జీవిత చరిత్రలో చదివాను. ఓ చెక్కబోనులో ఆయన తనని తాను కొంతకాలం బంధించుకుని బయటకి రాలేదు. అది ఆ ఆశ్రమంలో పాఠకులు

చూసి ఉండచ్చు కూడా. కర్మసిద్ధాంతాన్ని దానికి జోడించి మునిరత్నాన్ని గురువు అలా బంధించిన సన్నివేశానికి ఇదే ప్రేరణ. మునిరత్నానికి ధ్యానంలో వచ్చిన అనుభూతులకి ప్రేరణ అప్పట్లో రోజుకి నేను ఎనిమిది గంటలు చేసిన నాకు వచ్చిన అనుభూతులు వచ్చేవి ధ్యానంలో పులి, పిల్లి అరుపులు, తాచుపాము బుసలు మొదలైనవి వచ్చేవి. ఎవరో కడుపులో రెండు దోసిళ్ళు పోనించి ఏదో బయటకి తోడే భావన కలిగేది. నాకు తెలీకుండానే అనేక ఆసనాలు వచ్చేవి. ధ్యానంలో నా శరీరాన్ని నేను సాక్షిగా చూసేవాడిని. దేవాలయాల్లో, ధ్యానంలో ఆనందం పట్టలేక నాకు కన్నీళ్ళు ఉబికేవి. ప్లస్ నా సద్గురువు శ్రీ నిత్యానందబాబా శిష్యుడు స్వామి ముక్తానంద రాసిన చిత్‌శక్తి విలాసం అనే పుస్తకంలోని ధ్యానానుభూతులు.

ఇక్కడి తాతాజీ అనే పాత్రకి ప్రేరణ మహారాష్ట్రకి చెందిన ఓ అవధూత. ఆయన అశుద్ధం సువాసనలు చాలాదూరం వ్యాపించేవిట. అందుకని ఆయన దాన్ని మట్టిలో కప్పెట్టేసేవారట.

గాల్లో తేలే విద్యని దొంగ యోగులు ఎలా ప్రదర్శిస్తారో చదివాక ఆ సంఘటనలని కూడా జయంలో రాసాను.

మరోసారి తల్లి కడుపున పుట్టకూడదు అన్న ధ్యేయంగల మునిరత్నం పాత్ర పాఠకులు అందరికీ నచ్చడం నా అదృష్టం.

భోజనం లేకుండా జీవించిన ఓ యోగి గురించి మీరు కూడా ఒక యోగి ఆత్మకథలో చదివే ఉంటారు. సూర్యరశ్మి నించే మనం తినే ప్రతీ ఆహారం తగిన శక్తిని గ్రహించి స్టోర్ చేసుకుంటుంది. ఆమధ్య పూజారి లేకుండా సరాసరి సూర్యకాంతి నించి శక్తిని ఆబెంగాలీ మహాత్మురాలు గ్రహించేది అని తెలిసి పరమహంస యోగానంద ఆవిడని సందర్శిస్తారు. దీన్ని తాతాజీకి రాసాను. యోగి ఆత్మజ్ఞానానికి దగ్గరయ్యే కొద్దీ కామప్రకోపం అధికం అవుతుందని లాహిరి మహాశయుడి ఆత్మకథలో చదివాను. దాన్నికూడా మునిరత్నం ధ్యాన తుది దశలో రాసాను. మాస్టర్ సి.వి.వి మార్గంలోని, మంగళగిరికి చెందిన మల్లిక్ రాసిన లోనున్నదెవరు? నీలోనున్నదెవరు? అనే వేదాంత పాటని కూడా ఆయన అనుమతితో ఇందులో వాడాను.

చివర్లో రాసిన త్యాగాత్ శాంతి రనంతరం అనే పదాలు భగవద్గీతలోని ఏ శ్లోకంలో ఉందో వెదికి పట్టుకోడానికి నాకు అరరోజు పట్టింది. నా భార్య పద్మజ, నేను ఇద్దరం కలిసి ఆ 700 శ్లోకాలని వెదికాం.

ఆత్మజ్ఞానం పొదిన వ్యక్తి గురించి చివర్లో రాయడం నాకో పెద్ద ఛాలెంజ్. కారణం రమణమహర్షి అన్నారు. తనకి ఆత్మజ్ఞానం దొరికింది అని చెప్పినవాడికి అది దొరకలేదు. దొరికిన వాడు చెప్పడు. మాతా అమృతానందమయి జీవిత చరిత్రలో కూడా ఆవిడకి కలిగిన ఆ అనుభవాన్ని చెప్పించడానికి ఎంతోమంది, ముఖ్యంగా అమెరికన్ భక్తుడు నీల్ ఎంత ప్రయత్నించినా ఆవిడ చేత చెప్పించలేకపోయారు. ఆ అమృత క్షణం గురించి నేను వర్ణించిన తీరు నాకు బాగా నచ్చింది. ఆ అధ్యాయం ఇలా ముగుస్తుంది.

మృత్యువుకి శాశ్వత మరణం సంభవించింది.

మానవుడు మాధవుడయ్యాడు.

జీవుడు శివుడయ్యాడు.

నరుడు నారాయణుడు అయ్యాడు.

కింకరుడు శంకరుడు అయ్యాడు.

పశువు పశుపతయ్యాడు.

కాముడు రాముడయ్యాడు.

పాపి గోపి అయ్యాడు.

శవం శివంగా మారింది.

ఆత్మ పరమాత్మ అయింది.

"అహం బ్రహ్మాస్మి." పరిపూర్ణ అనుభూతితో మునిరత్నం చెప్పాడు.

ఆ రోజు గురుపౌర్ణమి.

ఆత్మజ్ఞాని అయ్యాక మునిరత్నంకి శివబాబా అనే పేరుని అతను అందర్నీ 'శివా' అని పిలుస్తూండటంతో పెడతారు. రాఖాడీ బాబా అందర్నీ శివ అని పిలిచేవారు అని చదివి ఆ ప్రభావంతో మునిరత్నం అందర్నీ 'శివా' అని పిలిచేవారని రాసాను. నేను నా ఆధ్యాత్మిక గురువుగా భావించే సద్గురు నిత్యానందబాబా శిష్యుల్లో ఒకరు రాఖాడీ బాబా. ఆయన నిత్యానందబాబా దగ్గర వంటమనిషిగా పని చేస్తూ ఆధ్యాత్మిక ప్రగతిని సాధించిన మహాత్ముడు.

శివబాబా ప్రదర్శించే లీలలు, 1940లలో నా సద్గురువు శ్రీ నిత్యానందబాబా ప్రదర్శించిన వాటిలో కొన్నిటిని ఆయన జీవితచరిత్ర నించి తీసుకున్నాను.

తన తల్లికి యోగాగ్నితో శివబాబా చితిని అంటించి అంత్యక్రియలు చేస్తాడు. ఇది ఆదిశంకరాచార్య జీవిత చరిత్రలో జరిగిన సంఘటన నించి తీసుకున్నాను.

ఈ కింది సంఘటన గురించి హరిద్వార్‌లో విన్నాను. దాన్ని యధాతథంగా జయం చివర్లో వాడాను.

ఆ ఏడు పండిత సభలకి ఓ పీఠాధిపతిని అధ్యక్షుడిగా పిలిచారు. పండిత సభ జరిగే కైలాశ్రమ ఆవరణలోని ఏర్పాట్లని రాజేంద్రకుమార్ స్వయంగా పర్యవేక్షిస్తుండగా అక్కడికి వచ్చిన శివబాబా నవ్వి 'ఎందుకు అనవసరపు ఖర్చు? మూడురోజులపాటు ఎటూ ఈ సభ జరగదు' అన్నారు. రాజేంద్రకుమార్‌కి ఆ మాటలకి ఎంతో చిరాకేసింది. ఆ దిగంబర వింత వ్యక్తి మీద అరిచాడు.

"చంపుతా. పో ఇక్కడ్నించి."

మర్నాడు ఉదయం ఎనిమిదిన్నరకి సభ ఆరంభం అవడానికి ఇంకా కొద్ది క్షణాల వ్యవధే వుంది. భారత రాష్ట్రపతి శ్రీ జాకీర్ హుస్సేన్ మరణించారని, రాష్ట్రపతి మరణానికి సంతాప సూచకంగా ఎలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరుపరాదని, దాంతో ఆ పండిత సభకి ఇచ్చిన అనుమతిని మూడు రోజులపాటు ఉపసంహరించుకుంటున్నామంటూ సబ్ ఇన్‌స్పెక్టర్ వచ్చి నోటీస్‌ని రాజేంద్రకుమార్‌కి అందించాడు. రాజేంద్రకుమార్‌కి అప్పటికి కానీ బోధపడలేదు, క్రిందటి రోజు తను పిచ్చాడిలా భ్రమించిన వ్యక్తి మాటల్లోని అర్థం. వెంటనే అతని కోసం వెదికాడు. సాలిగ్రాం ఘాట్ దగ్గర శివబాబా ఆయనకి కనిపించారు.

శివబాబా ముందు కూర్చున్న లౌకికులకి కళ్ళమ్మట నీళ్ళు ధారగా కారడం రాసాను. కొందరు మహాత్ముల ముందు ఇది నా స్వానుభవం. మాతా అమృతానందమయి దగ్గరకి వెళ్ళిన చాలామంది ఇలా దుఃఖించడం చూసాను. శ్రీ గణపతి సచ్చిదానందస్వామి చిన్నప్పుడు వారి సోదరి పాము కాటుతో మరణించడంతో, ఆయన పాముల్ని పట్టి వాటి కోరలు తీసి వదిలేసేవారని ఆయన ఆత్మకథలో చదివాను. మునిరత్నం సన్యసించడానికి సాయపడిన మురళి కూడా ఓ పాము కోరల్ని తీసేస్తాడు. ఆ దుష్కర్మ ఫలితంగా అతనికి వృద్ధాప్యంలో దంతాలు ఊడిపోతాయి. మహాత్ముడైన శివబాబా దాన్ని తనకి బదిలీ చేసుకోగలగడంతో ఆయన దంతాలు ఊడిపోయి మురళి దంతాలు నిలిచి ఉంటాయి అని రాసాను. ఇలా దుష్కర్మని బదిలీ చేసుకుని తను దాన్ని అనుభవించడం గురించి చేంబోలు సుబ్రమణ్యశర్మగారు చెప్పారు. కలకత్తాలోని రామ్‌లాల్ అనే జీవన్ముక్తుడు ఇలా ఓసారి తన ప్రియశిష్యుడి చెయ్యి విరిగితే, అది తక్షణం తనకి బదిలీ చేసుకున్నాడు. మేడమీంచి పడ్డ శిష్యుడి చెయ్యి విరగలేదు. ఆ సమయంలో కలకత్తాలో ఓ బహిరంగ సభలో కూర్చుని ఉన్న రామ్‌లాల్ చెయ్యి విరిగింది.

అహోబిలానికి వెళ్ళే దారిలో అత్తాకోడళ్ళ విశ్రాంతి మందిరం వస్తుంది. గతంలో అత్తాకోడళ్ళు ఎవరో యాత్రికుల సౌకర్యం కోసం దాన్ని నిర్మించారు అని శ్రీనివాస్ రెడ్డి దాన్ని చూపించి చెప్పారు. దాని ఆధారంగా కూడా జయం చివర్లో ఓ చిన్న అధ్యాయం రాసాను.

రమణ మహర్షి మరణానంతరం ఆకాశంలో వెలుగు వెళ్ళడం చాలామంది చూసారు. దాని గురించి హిందూలో కూడా వార్త రాసారు. దాని ఆధారంగా శివబాబా మహాభి నిష్క్రమణానంతరం సరిగ్గా ఇలాగే జరిగినట్లుగా రాసాను.

దేహత్యాగానంతరం శివబాబా తను వస్తానని చెప్పి వెళ్ళని ఒకరింటికి మరో దేహంతో వెళ్ళి ఆ సంగతి వారికి స్ఫురించేలా చేసే ఉపశ్రుతితో నవల ముగుస్తుంది. ఇది కూడా పరిపూర్ణానంద స్వామి జీవితచరిత్రలో చదివాను. 271 పేజీల ఈ నవల అచ్చై పదహారేళ్ళైనా నేటికీ పాఠకులని ఆకట్టుకోడానికి పైన ఉదహరించిన మహాత్ముల ఆశీస్సులే కారణం అని మరోసారి చెప్తూ దీన్ని ముగిస్తున్నాను.

ప్రస్థుతం ప్రిజమ్ బుక్స్ ప్రచురించిన ఎడిషన్ మార్కెట్లో ఉంది. వెల రూ.170 / -

(వచ్చేనెల మరో నవల వెనుక విశేషాలు)

www.anandbooks.com
www.telugubooks.in

***ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి***

Post your comments